


పోచంపాడ్ రోడ్డుపై చిమ్మచీకట్లు... 2



అదుపుతప్పి కారు బోల్తా.. 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

29-3-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## అడూర్ నియోజకవర్గంలో ఎన్నికలపై సమీక్ష




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కేరళలోని అడూర్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 30న అడూర్ నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహించను న్నారు.ఈ సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొననున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సభ ఏర్పాట్లపై స్థానిక నాయకులతో చర్చించారు.

# మండుతున్న ఎండలు..



ఉమ్మడి జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. మార్చిలోనే భగభగమండే ఎండలకు ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ఈ సీజన్‌లో ఉష్ణోగ్రతలు గతేడాదితో పోలిస్తే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ సైతం హెచ్చరించింది. దీంతో నగరంలో ఎండ నుంచి కాపాడుకునేందుకు ప్రజలు జాగ్రత్తలు పాటిస్తున్నారు. వాహనదారులు బైక్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

– అక్షరటుడే, ఫొటోగ్రాఫర్ నిజామాబాద్




– మిగతా ఫొటోలు 2వ పేజీలో..




## యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రూరల్ పీఎస్ ఆధ్వర్యంలో '2కే రన్' నిర్వహించారు. కార్యక్రమాన్ని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వద్ద సీపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడవాలని.. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. 2కే రన్ కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం మాత్రమే కాకుండా, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఒక బలమైన సందేశాన్ని వినిపించాలని పోలీస్ శాఖ సంకల్పమన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వా రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎస్సైలు ఎండీ షరీఫ్, ఆనంద్ సాగర్ పాల్గొన్నారు.



## 66 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలిశారు..

**ఆర్మూర్ బాలుర ఉన్నత పాఠశాల 1959-60 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ సమ్మేళనం జరుపుకున్నారు. అంకాపూర్‌లో కార్యక్రమం నిర్వహించారు. 66 ఏళ్ల తర్వాత అందరూ ఒక్కచోట చేరి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి నోముల రామచంద్రా రెడ్డి, లింగాగౌడ్ అన్నిరకాలుగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భూపతిరెడ్డి, బసంత్ రెడ్డి, ఇంద్రారెడ్డి, రాంరెడ్డి, గంగారెడ్డి, తుకారాం తదితరులు పాల్గొన్నారు.**

– అక్షరటుడే, ఆర్మూర్



## డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

**అక్షరటుడే, మాక్లూర్:** డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డిని ఆయన స్వగృహంలో ఆదివారం మాక్లూర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నగేష్, మాజీ సొసైటీ చైర్మన్ దయాకర్ రావులతో పాటు తొమ్మిది గ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాక్లూర్ మండలంలోని పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

# సరెండర్‌పై సందిగ్ధం..



**కామారెడ్డి మున్సిపల్ బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఇద్దరు అధికారులను సరెండర్ చేయాలని సభ్యులు తీర్మానం చేయడంపై పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతోంది. బల్దియా చరిత్రలోనే తొలిసారి అధికారులను సరెండర్ చేయాలని తీర్మానం చేయడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఉత్కంఠ నెలకొంది. మరోవైపు త్వరలో జరిగే సర్వసభ్య సమావేశంలో సైతం ఇదే అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది.**

- అక్షరటుడే, కామారెడ్డి

- ▸ అధికారులను సరెండర్ చేయాలని కామారెడ్డి బల్దియా సభ్యుల తీర్మానం
- ▸ అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో?
- ▸ జనరల్ బాడీ సమావేశంపై ఉత్కంఠ

మున్సిపల్ పాలకవర్గం కొలువైన వారం పది రోజుల్లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించాలి. అయితే పాలకవర్గం కొలువైన నెల తర్వాత కూడా సమావేశం జరగకపోవడం, మార్చి చివరి లోపు బడ్జెట్ సమావేశం నిర్వహించాల్సిన పరిస్థితులు రావడం ఇక్కడ చర్చకు దారి తీసింది. జనరల్ బాడీ నిర్వహించకుండానే బడ్జెట్ సమావేశం నిర్వహించడంపై పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరును ఎండగట్టారు. అయితే మొదటి సమావేశమే అధికారులపై ఆగ్రహానికి వేదికైంది. బడ్జెట్ ఆమోదం కోసం ఏర్పాటు చేసిన సమావేశం రసాబాసగా మారి మున్సిపల్ కార్యాలయానికి వెన్నుదన్నుగా ఉండే ఇద్దరు ముఖ్య అధికారులను సరెండర్ చేయాలని పట్టుబట్టే వరకు వెళ్ళింది. ఈ పరిణామం ఎవరు ఊహించకపోవడంతో తీవ్ర చర్చకు దారి తీసింది.

### జనరల్ బాడీ సమావేశంపై ఉత్కంఠ

బడ్జెట్ సమావేశంలో సభ్యులు మున్సిపల్ కమిషనర్, టీపీవోను సరెండర్ చేయాలని తీర్మానం చేశారు. అన్ని పార్టీల సభ్యులు, చివరకు చైర్‌పర్సన్ సైతం అధికారులపై సరెండర్ తీర్మానం ప్రవేశ పెట్టాలని నిర్ణయించడం గమనార్హం. అధికారులపై సభ్యులకు ఉన్న ఆగ్రహానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. త్వరలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కౌన్సిల్ మొత్తం ఆగ్రహంతో ఊగిపోతున్న క్రమంలో జనరల్ బాడీ సమావేశం ఉంటుందా లేదా అనే సందిగ్ధం నెలకొంది. పట్టణంలో సమస్యలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో జరగబోయే సమావేశంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఏప్రిల్ 5న

ఈ నెలలోనే సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా సమయం సరిపోకపోవడంతో ఏప్రిల్ 5 న నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. అయితే కమిషనర్, టీపీవోలపై కౌన్సిల్ సభ్యులంతా ఆగ్రహంగా ఉండటంతో అసలు సమావేశం ఉంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమావేశం నిర్వహిస్తే మరోసారి అధికారులను సరెండర్ చేయాలని తీర్మానం చేసే అవకాశాలు ఉన్నట్టుగా సమాచారం.

### సరెండర్‌పై సందిగ్ధం

మున్సిపల్ చట్టం ప్రకారం బడ్జెట్ సమావేశాల్లో అధికారులను సరెండర్ చేసే తీర్మానాలు పనిచేయవన్న టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో బడ్జెట్ సమావేశంలో చేసిన తీర్మానంపై సందిగ్ధం నెలకొంది. బడ్జెట్ సమావేశ తీర్మానం చెల్లకపోతే జనరల్ బాడీ సమావేశంలో మరోసారి తీర్మానం చేయడానికి కౌన్సిలర్లు నిర్ణయించుకున్నట్టుగా తెలుస్తోంది.

### సరెండర్ చేస్తారా..?

బడ్జెట్ సమావేశంలో చేసిన సరెండర్ తీర్మానం చెల్లకపోతే మరోసారి జనరల్ బాడీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ మరోసారి తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తే కౌన్సిల్ చేసిన తీర్మానంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఇద్దరు అధికారులపై తీర్మానంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కామారెడ్డి బల్దియాపై చర్చ జరుగుతోంది. మరోసారి తీర్మానం చేసి అధికారులను సరెండర్ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కానుంది.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల నియామకం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ చర్యలు చేపట్టారు. ఇందులో భాంగా పార్టీ గ్రామ అధ్యక్షులను నియమించారు. గోపాల్‌పేట్‌కు సూరపల్లి రాజు, నాగిరెడ్డిపేటకు బోయిని హన్మాండ్లు, గోలి లింగాలకు దాకన్నగారి మోహనరెడ్డి, పల్లె బోగుడు తండాకు హరి నాయక్, జప్తి జానకంపల్లి ఎరుమల్ల రాజయ్య, వాడి గ్రామానికి పుట్టి నర్సింలు, అచ్చాయిపల్లి జంగం రజనీకాంత్, రామక్కపల్లికి కట్ట మోహన్‌ను నియమించారు. అలాగే చిన్న ఆత్మకూర్‌కు లచ్చిగారి రవీందర్, వదల్‌పర్తికి ఈగ శ్రీనివాస్ రెడ్డి, వెంకంపల్లికి మాటూర్ గోపాల్, రాఘవపల్లికి ఏనుగుల మోహన్, పెద్ద ఆత్మకూర్‌కు యుగేందర్ రెడ్డి, కన్నారెడ్డి గ్రామానికి దండు సురేందర్, పోచారం గ్రామానికి కాలాలి నర్సాగౌడ్‌ను నియమించారు. కాగా.. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ అధ్యక్షులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత చురుకుగా నిర్వహించడంతో పాటు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యతలను కొత్త అధ్యక్షులు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అలాగే.. ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కారదిశగా కృషి చేయాలని సూచించారు.

## పాఠశాలలో మరమ్మతులకు నిధులు మంజూరు

**అక్షరటుడే,ఎల్లారెడ్డి:** రాజంపేట మండలంలోని కొండపూర్ ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్ మోహన్ రూ.12లక్షల నిధులను మంజూరు చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరు చేయడంపై గ్రామ ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్య వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.12లక్షల నిధులను మంజూరు చేయించారు. టాయిలెట్ల నిర్మాణంతో పాఠశాలలో పరిశుభ్రత మెరుగుపడడమే కాకుండా, విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగే అవకాశముందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.







## ఆకట్టుకున్న రోబో ఫెస్ట్..

**కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోబో ఫెస్ట్ ఆదివారం ముగిసింది. నగరంలోని శ్రీరామ గార్డెన్స్‌లో రెండురోజులుగా ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు మెడల్స్ అందజేసింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రజనీకాంత్, రామోజీ రావు, తేజస్విని, రాజా, ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్, రవికాంత్, సుచరిత, వైస్ ప్రిన్సిపాళ్లు, భావన, భూపాల్, రోబోటిక్స్ హెడ్ నిరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.**

–అక్షరటుడే, ఇందూరు

## సనాతన ధర్మరక్షణకు అందరూ ఏకం కావాలి: పిట్ల కృష్ణ మహారాజ్

**అక్షరటుడే, మాక్లూర్ :** భారతదేశ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శమని మల్లారం లింగేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహారాజ్ అన్నారు. అలాంటి మన సంస్కృతి, సనాతన ధర్మాన్ని రక్షించుకునేందుకు హిందువుగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గొట్టుముక్కల గ్రామంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిట్ల కృష్ణ మహారాజ్ హిందూ ధర్మ పరిరక్షణపై మాట్లాడారు. మన ధర్మం కోసం అనేక పోరాటాలు, యుద్ధాలు జరిగాయని.. రామాయణ, మహాభారత కథలను కొన్ని వివరించారు. మంచితో పాటు చెడు కూడా సమాజంలో ఉంటుందని.. కానీ రాముడు మంచికి సూచిక అయితే రావణుడు చెడుకు సంకేతమని అభివర్ణించారు. పిల్లలను ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ మాట్లాడుతూ మన దేశం వసుదైవ కుటుంబమని, అంతా రాముని బాటలో నడవాలని సూచించారు. హిందుత్వం మన జీవన



విధానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ గ్రామ వికాస్ జిల్లా ప్రముఖ్ ధాత్రి పాండు రంగారావు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు బచ్చు రమేశ్, ప్రధాన కార్యదర్శి యాట గంగాధర్, సర్పంచ్ యాట సువర్ణ, ఉప సర్పంచ్ ఒడ్డెన్న, గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు, 18 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## వెంకటాపూర్‌లో బోనాల ఊరేగింపు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన పంగిడి మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం అమ్మవారికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఆటపాటలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా బోనాలు సమర్పించారు. అనంతరం గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కేంద్ర ప్రభుత్వం వయోజన విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయంతో అమ్మకు అక్షరాభ్యాసం (ఉల్లాస్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అమ్మకు అక్షరమాల పేరుతో మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర,రాష్ట్ర, ప్రభుత్వాలు సంకల్పించాయి. దీంట్లో భాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళా నిరక్షరాస్యులను గుర్తించారు. 'అక్షర వికాసం' పుస్తకాల సాయంతో వారితో తెలుగు చదవడం అంకెలు గుర్తించడం సాధన చేయించారు. జిల్లాలో 526 సెంటర్లు ఏర్పాటు చేసి 16,331 మంది మహిళలకు పరీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మండలంలో 1,645 నిరక్షరాస్యులను గుర్తించారు. మొదటి విడతగా 17 సెంటర్లలో 700 మంది మహిళలకు పరీక్ష నిర్వహించారు. జిల్లా నుండి డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ నూకల శ్రీనివాస్, ఏపీఎం రాం నారాయణ్ గౌడ్, మాచాపూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ గంగమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు హాజరయ్యారు.

## ఆలూర్ మండలంలో..



**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని గ్రామాల్లో ఆదివారం 'ఉల్లాస్' అక్షరాస్యత పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో గంగాధర్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ.. వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వం 'ఉల్లాస్' పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ముక్కెర విజయ్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజారాం, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్ గౌడ్, సీసీ ప్రకాష్, వీవో లత, రోజా, రేఖ పాల్గొన్నారు.




# పోచంపాడ్ రోడ్డుపై చిమ్మచీకట్లు..

**పోచంపాడ్ ఎక్స్ రోడ్డు నుంచి ప్రాజెక్ట్ రోడ్డుపై చిమ్మచీకట్లు అలుముకున్నాయి. ప్రాజెక్ట్‌కు వెళ్లే ఈ రోడ్డులో రాత్రివేళల్లో ప్రయాణించాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయించినప్పటికీ పనులు ముందుకు సాగట్లేదు.**

**– అక్షరటుడే, బాల్కొండ**

- నాలుగు కి.మీ పొడవునా పనిచేయని హైమాస్ట్ లైట్లు
- నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- ముందుకు సాగని పనులు.. ఇబ్బందుల్లో ప్రజలు



బాల్కొండ మండలంలోని పోచంపాడ్ ఎక్స్ రోడ్ నుంచి ఎస్సారెస్పీ వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు ఉంది. అయితే గతంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే కొన్నేళ్లుగా ఈ లైట్లు పనిచేయడం లేదు. అంతేకాకుండా హైమాస్ట్ లైట్ల పైభాగాలు విరిగిపోయి ఏ సమయంలోనైనా వాహనదారుల పై పడేట్లుగా వేలాడుతూ ఉన్నాయి. దీంతో వాహనదారులు భయంభయంగానే ప్రయాణిస్తున్నారు.

### రాత్రయితే ప్రయాణం నరకం..

ఇక రాత్రివేళల్లో ఈ రోడ్డుపై వాహనదారులు వెళ్లాలంటే భయపడుతున్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఒక్క లైట్ కూడా పనిచేయక పోవడంతో బైక్‌పై వెళ్లేవాళ్లు ఆందోళన చెందుతున్నారు. సుమారు 5వేల వరకు జనాభా ఉండే ఈ ప్రాంతంతో రాత్రివేళ్లలో హైమాస్ట్ లైట్లు పనిచేయక అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనిపై స్థానిక అధికారులు ఫిర్యాదులు చేసినప్పటికీ వృథాగా మారుతోందని స్థానికులు అంటున్నారు.

### ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో..

ఈ సమస్యను గతంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి విన్నవించగా ఆయన వెంటనే స్పందించి రూ. కోటి 20 లక్షలను మంజూరు చేయించారు. దీంతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు ఆర్అండ్‌బీకి ఈ పనులు అప్పజెప్పారు. కానీ అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటినుంచి పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా తయారైంది. నిత్యం ఈ రోడ్డపై రాత్రి వెళ్లాలంటే మాత్రం ప్రజలు జంకుతున్నారు. పాములు, జంతువులు రోడ్లపైకి వస్తున్నాయని చెబుతున్నారు. అలాగే చీకట్లో ప్రమాదాలు సైతం జరిగే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### త్వరగా పూర్తి చేయాలి..



రోడ్డుపై ట్రాఫిక్ లైట్లు లేక చాలా ఇబ్బందిగా మారింది. గతంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఈ లైట్ల కోసం నిధులు మంజూరు చేయించారు. కానీ ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పనులు ప్రారంభించారు.

**– సంపంగి సతీష్, పోచంపాడ్ ఉపసర్పంచ్**



## అర్సపల్లి పీహెచ్‌సీకి కుర్చీలు, టేబుళ్లు అందజేత



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అర్సపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుర్చీలు, టేబుళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. చికిత్స కోసం వచ్చే రోగులకు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో వీటిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, శ్రీకర్, రాజేష్, సంతోష్, విజయ్, పీహెచ్‌సీ సూపరింటెండెంట్ నవ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## అదుపు తప్పి కారు బోల్తా.. ఒకరికి గాయాలు



**అక్షరటుడే, గాంధారి:** అదుపు తప్పి కారు బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.. ఈ ఘటన పోతంగల్ కలాన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని పోతంగల్ కలాన్ వద్ద బాన్సువాడ నుండి గాంధారి వస్తున్న కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కార్తీక్ అనే వ్యక్తి కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయాలైన వ్యక్తికి ఫస్ట్ ఎయిడ్ నిర్వహించారు. అనంతరం ఈఆర్‌సీసీ మహేశ్ సలహా మేరకు బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికితరలించినట్లు ఈఎంటీ రమేష్, పైలెట్ ప్రకాష్ గౌడ్ తెలిపారు. చురుకుగా స్పందించి సమయానికి సంఘటనాస్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బందిని పోతంగల్ కలాన్ గ్రామస్థులు అభినందించారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** డ్రంకన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ వివరాలు వెల్లడించారు. నగరంలోని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 41 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. విచారించిన మెజిస్ట్రేట్ హైమద్ మొహియుద్దీన్ ఆరుగురికి వారం రోజుల పాటు జైలుశిక్ష విధించారు. 35 మందికి ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున జరిమానాలు విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ.. డ్రంకన్ డ్రైవ్ నిబంధనలు కఠినంగా ఉన్నాయని.. మద్యం తాగి రోడ్లపైకి వచ్చేముందు ఆలోచించుకోవాలని హెచ్చరించారు.

## మహిళలకు ఉల్లాస్ పరీక్షలు..



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం మహిళలకు ఉల్లాస్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ రేణుక సంజీవ్ సందర్శించారు. కార్యక్రమంలో డీపీఎం రాజయ్య, ఏపీఎం ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. అలాగే తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉల్లాస్ పరీక్ష జరిగింది. సర్పంచ్ బంగారు శంకర్, గ్రామ అధ్యక్షురాలు గంగవ్వ, సంధ్య పర్యవేక్షించారు.

## స్వచ్ఛభారత్ సేవలు అభినందనీయం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలు అభినందనీయమని ట్రాన్స్‌కో డీఈ రఘు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్ కాలనీలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయా ఆవరణలోని చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ కృష్ణ, ట్రాన్స్‌కో సిబ్బంది సంతోష్, లింగం, గంగాధర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేదశ్రీ రాజ్ కుమార్, జంగిడి భోజన్న, బాశెట్టి పెద్ద గంగారాం పాల్గొన్నారు.

## గాంధారిలో దారుణం.. బంగారం కోసం అత్తను హత్య చేసిన కోడలు

**అక్షరటుడే, గాంధారి:** గాంధారిలో మండలంలో దారుణం చోటు చేసుకుంది. బంగారం కోసం ఓ కోడలు తన అత్తను బండరాయితో కొట్టి హత్య చేసింది. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని సీతాయిపల్లికి చెందిన కావటి రుక్మవ్వ (73)కు నలుగురు సంతానం. అయితే అందులో ఇద్దరు పెద్ద కొడుకులు చనిపోవడంతో వారి భార్యలు, రుక్మవ్వ వేర్వేరుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే చిన్న కొడుకు మాత్రం హైదరాబాద్‌లో బతుకుదెరువు కోసం వెళ్లాడు. రెండో కొడుకు భూమయ్య భార్య అయిన కోటవ్వ తరచూ అత్త రుక్మవ్వతో డబ్బుల విషయంలో గొడవ పడుతూ ఉండేది. శనివారం తెల్లవారుజామున ఎలాగైనా ఆమెను హత్యచేసి ఆమె దగ్గర ఉన్న డబ్బు, బంగారం తీసుకోవచ్చని ఆలోచన చేసింది. రుక్మవ్వ తలపై కోటవ్వ బండరాయితో కొట్టగా ఆమె అక్కడికక్కటే మృతి చెందింది. అటుపై ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్లు, చెవి కమ్మలు చోరీ చేసి.. ఎవరికీ తెలియకుండానే అందరితో పాటు ఏడుస్తూ కూర్చుంది. అయితే బంధువులకు అనుమానం రాగా.. రుక్మవ్వ కూతురు కిష్టవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి కోడలిని నిందితురాలిగా గుర్తించారు. నేరస్థలాన్ని సదాశివ నగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

## హిందూ సమ్మేళన సమితి ఏర్పాటు



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని కల్కినగర్ బస్తీలో హిందూ సమ్మేళన సమితిని నూతనంగా ఏర్పాటు చేశారు. సమితికి అధ్యక్షుడిగా ఆమెటి రమేష్, ప్రధాన కార్యదర్శిగా పోతరాజు వెంకటేష్, కోశాధికారిగా సిద్ధంశెట్టి పవన్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కల్కినగర్ బస్తీవాసులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు..









## డివైడర్‌ను బైక్ ఢీకొని ముగ్గురి మృతి

**అక్షరటుడే గాంధారి:** రాష్ట్రాలు దాటి కూలీ పనుల నిమిత్తం వచ్చిన కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఈ ఘటన గాంధారి మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గాంధారి మండలంలోని రాంపూర్ గడ్డ వద్ద ఉన్న రైస్ మిల్‌లో ఉత్తర ప్రదేశ్, బీహార్ నుంచి వచ్చిన వలసకూలీలు ముకీయ(21), రాహుల్ (21), జావీద్ అన్సారి (22) పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటలకు ఒకే బైక్‌పై ఈ ముగ్గురు యువకులు బయటకు వెళ్లి గాంధారికి వస్తున్న క్రమంలో మండల కేంద్రంలో వారి వాహనం కల్వర్టును బలంగా ఢీకొంది. దీంతో ముగ్గురు రోడ్డుపై పడిపోయారు. స్థానికులు అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆ ముగ్గురు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గాంధారి ఎస్సై ఆంజనేయులు పంచానామా చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.